(౨)

# సంసారభారం

విసిగి వేసారి చివరకు ఈరోజున ఖచ్చితంగా చెప్పే శాను—'పండిట్ రావు! రేపో మాపో నువ్వు మా ఇంట్లో నుంచి మకాం ఎత్తేయాలిసుమా!' అని. కాని పండిట్ రావు కుర్చీలో కూర్చున్నవాడు కూర్చున్నపళంగానే నిర్వికారంగా అడిగేశాడు—ఎందుకూ?' అని. నాకు కోపం ఉబుక్కువచ్చింది. "ఎందుకేమిటోయ్? నా ఇంట్లో బైఠాయించి నాకే ఎదురుప్రశ్న వేస్తావ్! నువ్విక్కడ వుంటానికి వీల్లేదు. నా భార్యను సోమవారంనాటికల్లా ఇక్కడికి రమ్మని ఉత్తరం రాయాలనుకుంటున్నా, కనుక నీదారి నువ్వు చూచుకోవటం ఉత్తమం!" అని మళ్ళీ ఖండితంగా అన్నాను. 'ఓహో! అలా చెప్పావుకాదు! మరదలు సోమవారంనాటికల్లా వస్తుందన్నమాట! సరే, అయితే వెధవ హోటలుబాధ తప్పుతుంది. నిజం చెప్పొద్దూ—నాకు హోటలు భోజనం సహించనే సహించదు! ఇంట్లో ఏమున్నా లేకపోయినా—నెయ్యీ, ముద్దపప్పూ, ఆవకాయ వుంటే పదికూర్లతో సమానం!... అయితే అలాగే రమ్మని వ్రాయి;' అన్నాడు, పండిట్ రావు—చదువుతూన్న పేపరు అమాంతంగాఆపి నా వేపు చూస్తూ!

నాకు అతని మొహంలోకి చూట్టం అసహ్యమేసింది. 'ఏంటోయ్ రాసేది? మర్యాద గాబయటికినడవమంటూంటేను!' అని కొంచెం ఘాటుగానే అన్నాను – కిటికీలోగుండా బయటికి చూస్తూ.

పండిట్‌రావు పేపరు అవతల పడేసి గబాలున నా చెంతకు వచ్చాడు. నిజం ఎందుకు చెప్పకపోవాలి—నాకు కొంచెం భయమేసింది—ఇలా నేను నిర్మొహమాటంగా మాట్లాడుతున్నందుకు రెచ్చిపోయి నాలుగు పుచ్చుకుంటా డేమోనని! కాని అలాంటిదేమీ జరగలేదు ప్రథమంలో కొంచెం ప్రశాంతంగా అన్నాడు—'మరి నేను నీకు చేసిన సహాయంమాటేమిటి?' అని. ఆ తరువాత తన ధ్వనిని కొంచెం హెచ్చించి—'ఇదిగో మధుసూదనరావ్రూ! చెబుతున్నా విను. నేనుమాత్రం ఇప్పుడప్పుడే నీ ఇల్లు వదిలివెళ్ళను మరల నా సకల సౌకర్యాలకు మరోచోట ఏర్పాటు జరిగేంతదాకా నా భారం నువ్వు వహించాల్సిందే!' అని తెగేసినట్టు చెప్పి మరల పత్రికాపఠనంలో లీనమయ్యాడు.

♦ ♦ ♦ ♦

నాలుగు నెలలనాటి విషయం: యూనివర్సిటీ పరీక్షలు రాసి ఇంటికి రావటంతోటే పెళ్ళిచేశారు. పెళ్ళయిన కొద్ది రోజులకే పరీక్షలు తెలిశాయి. చాలామంది మిత్రులకు 'క్లాసు' రాగా నేను ఆర్డినరీ క్లాసులో ప్యాసయ్యాను! తరువాత ప్రశ్న; జీవనోపాధి! బొడ్డున మా ణి క్యం పెట్టుకొని జన్మించాను గనుకనా...కడుపులో చల్ల కదలకుండా కాలిమీద కాలేసు కొని ఇంట్లో పడుకోడానికి! పైగా ఇంట్లోవాళ్లు ఊరుకున్నా భార్యతరఫువాళ్ళు నా రాబోయే ఉద్యోగాన్నిగురించి యక్ష ప్రశ్నలువేశారు. ఊరుకోలేక అభిమానంకొద్దీ...ఉద్యోగం సాధించేనిమిత్తం నగరానికి బయలుదేరాను. ఈ రోజుల్లో

సంఘంలో ప్రయోజకులుగా చెలామణి అవాలంటే చేతిలో నాలుగు చిలకలు ఆడాలి! అప్పుడు ఏ ఆట ఆడినా అడిగే వాళ్లుండరు! డబ్బు ముందు సర్వం దిగదుడుపే!

కాళ్ళరిగిపోయేట్టు తిరిగాను; కాని ఉద్యోగంమాత్రం దొరకలేదు. అప్పు డనిపించింది—అదీ ఇదీ ముక్కున బెట్టుకొని పరీక్షలు ప్యాసు కావటం తేలికేగాని ఉద్యోగంకోసం దేకటం మాత్రం అతి కష్టమైన పనుల్లో ఒకటని! కాని, చెప్పాను గదూ—పరీక్షలు తేలీటంతోటే పెళ్ళయిందని! ఉద్యోగం సంపాయించలేకపోతే భార్య తరఫువాళ్ళంతా దెప్పిపొడుస్తారనే అభిమానంకొద్దీ—విసుగులేకుండా కలుసుకోవలసిన ప్రతి వ్యక్తిని కలుసుకున్నాను. ఏక్షైంకు కన్పించమంటే ఆ టైముకు వెళ్ళి వాళ్ళ వాకిళ్ళముందు నిల్చున్నాను. చివరకు నా ప్రయత్నం ఫలించింది. ఒక స్టోర్సులో గుమాస్తా ఉద్యోగం లభించింది. అంటే ఒక కామర్సు గ్రాడ్యుయేట్‌కు వంద రూపాయల జీతం! ఇలాంటిగుమాస్తాను తయారుచేస్తున్నందుకు యూనివర్సిటీలను ఏమీ అనేందుకు వీల్లేదు! నేటి సామాజిక వ్యవస్థలోనే ఈ లోటున్నది.

ఫలానారోజున రమ్మన్నారు—ఉద్యోగంలో చేరటానికి! నా సంతోషానికి మేరలేకపోయింది. బయటికి నాలుగడుగులు వేశానోలేదో—మరల వెనక్కి పిలిచారు. స్టోర్సు మేనేజరు తన గదిలోకి పిలిచి—'ఈ ఉద్యోగమయితే నీకు ఖాయమే! అయితే దీనికొక షరతుంది; రెండువేలరూపాయల సెక్యూరిటీపత్రంమీద ఈ నగరంలోని పెద్దమనిషెవరైనా సంతకంచేస్తే చాలు! ఆ ఏర్పాటుఅయిన మరురోజునుంచి

నువ్వు ఉద్యోగంలోకి రావచ్చు.' అని అన్నాడు. నా చిగిర్చిన ఆశాలత వడిలిపోయింది! ఈ నగరంలో నేనెవర్ని ఎరుగుదును? ఎరుగున్న వ్యక్తులు నా విషయంలో ఏకొంచెం శ్రద్ధ తీసుకొని వున్నా ఇంతకంటే మంచి ఉద్యోగం వచ్చివుండును! ఏమిటి చెయ్యటం? 'సరేలెండి. రేపీపాటికివస్తాను" అనిచెప్పి బయటికి వచ్చాను.

'రెండువేల రూపాయల సెక్యూరిటీ పత్రంమీద మీరు కేవల సంతకంపెడితేచాలు—ఈ అబ్బాయిని నే నెరుగుదునని. నాకు ఉద్యోగం వస్తుంది. దీంట్లో మీ కేమీ ప్రమాదంలేదు.' అని ఒకాయనతో చెప్పగా—'ప్రమాదం ఉన్నదీ లేనిదీ అనుభవం ఉన్న నాకు తెలుసు! ఈ విషయంలో ఇంకెవరి నయినా చూడు బాబూ!—అన్నాడు. ఈయనకూ మా కుటుంబానికి ఒకప్పుడు చాలా దగ్గర సంబంధ ముండేదట! అందుకనే మావాళ్ళు—'ఆయనకు మనమంటే చాలా గౌరవం' అని చెప్పి పంపించారు! నగరంలో కాలు పెట్టగానే చాలామందికళ్ళు నెత్తికెక్కుతాయనే విషయం పల్లెటూళ్ళలో కూచున్న మనుషులకేం తెలుసు?

ఇంకో ఆయనకూడా ఇలాగే అన్నాడు—'డబ్బు—ఋస్కానికి సంబంధించిన వ్యవహారాలంటే-నే నెప్పుడూ చాలా దూరంగావుంటాను, అవి నాకు గిట్టవు' అని. ఇక ఆయనకు గిట్టే విషయాలేమిటోమరి !

ఏదో ఆశకొద్దీ...నాకు సహాయపడగల వ్యక్తులెవరయినా కన్పిస్తారేమోనని ఆ సాయంత్రందాకా గాలించాను. కాని కన్పించలేదు. ఎరుగున్న మనుషులే ఈ రోజుల్లో పెదవి

విరుస్తూంటే, ఇక ముఖపరిచయమున్న వ్యక్తుల విషయంలో గ్యారంటీ ఏముంది? వాళ్లు కేవలం 'ఓహో!' అంటే 'ఓహో' అనగలరు!

తిరిగి తిరిగి అలసిపోయి ఒక వీధిమలుపు హోటల్లో కూర్చుండగా అకస్మాత్తుగా నా క్లాసుమేట్ ఒకతను కన్పించాడు. నా ప్రాణం లేచివచ్చింది. అతన్ని నా ప్రక్కన కూచోబెట్టుకొని విషయమంతా సవిస్తరంగా వివరించాను— ఏదైనా సలహా చెబుతాడేమోనని! 'నీకు పండిట్‌రావు కన్పించాడా?' అన్నాడు—అంతా విని.

'పండిట్‌రావా? ఇక్కడా?' అన్నాను ఆశ్చర్యంగా,

'అవును-ప్రస్తుతం ఇక్కడే వున్నాడు. ఇవ్వాళ నాకు రెండుసార్లు కన్పించాడు. రెండుసార్లూ కాఫీ, టిఫిన్ ఇప్పించక తప్పిందికాదు... మన ఫైనలియర్‌లో మహానుభావుడు గుంటూరు వదలి వెళ్ళాడు; లేకపోతే మనం ప్యాసయి వుందుమా?...క్రితం సంవత్సరం మకాం విజయవాడలోవేసి_ ఐదారు మాసాలకుపూర్వం ఇక్కడికి చేరుకున్నాట్ట! మనిషి గుదిబండలాగా తగులుకునేమాట వాస్తవమేఅయినా అప్పుడప్పుడు యేదో ఒక రూపంలో మనకుసాయపడుతూఉంటాడు. కనుక యీ విషయంలో నువ్వతన్ని కలుసుకొని మాట్లాడు. అవసరమొస్తే కాళ్లు పట్టుకోవాలి మరి! తప్పదు.'

పండిట్‌రావు ఏ ప్రదేశాల్లో, యెప్పుడు కన్పించేదీ తెలుసుకున్నాక నా మనస్సు కొంత కుదుటపడింది. ఈ రోజుల్లో ఉద్యోగం దొరకటం ఎంత కష్టమైన పని! పైగా ఇప్పుడు ఏ కొంచం వెనుకంజవేసినా ఇది కాస్తా చేతులు దాటిపోతుంది.

పండిట్ రావు నిజంగా ఏ భాషలోనూ, ఏఉన్నతపరీక్షా ప్యాసుకాలేదు. పరిశోధనలు జరిపి ఏ విషయాన్నీ సిద్ధాంతీకరించలేదు—అయినప్పటికి 'పండిట్' అనే బిరుదును—అనేక విషయాలమీద అఖండంగా మాట్లాడగలడుగనుక—అతని మిత్రులంతా ఏకగ్రీవంగా ఆమోదించి అతనికి ప్రసాదించారు. దాన్ని పండిట్ రావు సహర్షంగా స్వీకరించాడు! ఆ తరువాత అతని అసలు పేరు మరుగునపడిపోయింది. బాలగంగాధర రావు కన్పించాడా?' అనిఎవరయినాపొరపాటున పండిట్ రావును దృష్టిలో పెట్టుకొని అడిగితే—కాలేజీ ఫంక్షన్సులో పాటలు పాడే గంగాధరరావో, మేగజిన్ ఎడిటోరియల్ బోర్డులోవున్న గంగాధరరావో, లేక టెన్నిస్ ప్లేయర్ గంగాధరరావో గుర్తుకొస్తారుకాని—నాలుగు సంవత్సరాలనాడు సెకండియర్ డిస్కంటిన్యూచేసి—ఇంకా ఇక్కడే మకాంవేసి పలువిషయాల్లో ప్రావీణ్యత సంపాదించిన మన బాలగంగాధర రావు ఎవరి దృష్టిపథంలోనూ మెదలడు! ఈయన్నుగురించి వాకబు చేసేప్పుడు 'పండిట్ రావు' అని నిరాటంకంగా ఉపయోగించవచ్చు! తనకు తానుగాకూడా ఇతరులకు ఇదే పేరు చెప్తూవుంటాడు!

ప్రతి హాస్టల్లోనూ, ప్రతి స్టూడెంట్లాడ్జిలోనూ, పండిట్ రావు కన్పిస్తాడు. ప్రతివాళ్ళ బాగోగుల్ని గూర్చి ప్రశ్నిస్తాడు. ప్రతి విషయంమీద తన అభిప్రాయాలు ఏకరువు బెడతాడు. మ్యునిసిపల్ చైర్మన్, పేరుగాంచిన ప్లీడరూ, ప్రసిద్ధికెక్కిన డాక్టరూ-అంతా పండిట్ రావుకుపరిచితులే! ప్రతి విద్యార్థి మీటింగులోనూ ఇతను కన్పించేవాడు. ప్రతిరాజకీయపక్షాన్ని గురించి—వాళ్ళ వాళ్ళ దగ్గర సదభిప్రాయాలు

వెలువరించేవాడు! పోట్లాటలు వగైరా వచ్చినప్పుడు—మను షుల్ని సమకూర్చి తను తెర వెనక వుండేవాడు! క్రొత్తవాళ్ళలో నేను ఫోర్త్ బి. ఏ. చదువుతున్నానని చెబుతుండేవాడు!—జాన్ రస్కిన్ 'అన్ టు ది లాస్టు' మీదా, షేక్స్పియర్ 'రోమియో అండ్ జూలియట్' మీదా, బెర్నార్డ్ షా నాటకాలమీదా కొన్ని పడికట్టు పదాల్ని ఉపయోగిస్తూ తన అభిప్రాయాల్ని అడక్కుండానే చెబుతూవుండటం అతని కలవాటు. కాలేజీలకూ, విద్యార్థులకూ సంబంధించిన ప్రతి కార్యక్రమంలోనూ పండిట్ రావు ఎవరికీ లేని చొరవ తీసుకొని పనిచేసేవాడు! ఎవరైనా రూం కావాలి భాయీ!' అంటే సాయంత్రందాకా వాళ్ళను తిప్పి రూం ఇప్పించేవాడు. ట్యూటర్ కావాలంటే మాట్లాడిపెట్టేవాడు. ఎవరికయినా జబ్బువస్తే డాక్టర్‌ను చూపించేవాడు. వీటన్నిటికి ప్రత్యామ్నాయంగా పండిట్‌రావు కోరేది కాఫి టిఫిన్, అప్పుడప్పుడు ఐదూ, పదీ చేబదులూ, ఎప్పటికీ తిరిగిరాని చేబదులు! అతను మాట్లాడే పద్ధతి చూశాక చేబదులు ఇవ్వకుండాను వుండలేరు; ఇచ్చింది మరల పుచ్చుకోటానికీ మనస్కరించదు.

ఆ రెండో రోజు ఉదయం తొమ్మిది గంటలకు పండిట్ రావు కన్పించాడు నన్నుచూచి ఒక్క గంతేసి కౌగలించుకున్నాడు! మనిషి మంచి డాబుసరిగా ఉన్నాడు. 'కాఫీకి వెళ్దాం రా.' అని హోటల్లోకి లాక్కెళ్ళాడు. టిఫిన్ తింటూ తన విషయాలు ఏకరువుబెట్టాడు—యేదో బిజినెస్ సంబంధంగా ఇక్కడఉన్నానని, వ్యాపారం వేలమీదనడుస్తున్నదనీ, తనంటే ఈ నగరంలో చాలామందికి అపార గౌరవ మర్యాదలున్నా

యనీ, గొప్పగొప్పవాళ్ళంతా తన చేతుల్లో వాళ్ళనీ—యేవో చాలా దొర్లిపోయాయి! నేను వీటన్నిటిని నమ్మీ, నమ్మలేని స్థితిలో ఉన్నా: అయినప్పటికి బిల్లు తీసుకుంటూ అన్నాను— 'పండిట్ రావూ! నీ వొకసహాయం చేసిపెట్టాలి'- అని! అలాగేనన్నాడు రావు. విషయం సవిస్తరంగా చెప్పాను. 'అదెంతపనోయ్' అన్నాడు—అంతావిని. ఆ స్టోర్సుమేనేజరు ఇతన్ని బాగా ఎరుగునట! దాని తాలూకు డైరెక్టర్లకు పండిట్ రావంటే ఎంతో గౌరవమట! 'నీ రెండువేల రూపాయల సెక్యూరిటీ పత్రంమీద నిరభ్యంతరంగా నేనే సంతకం బెడతాను; వెళ్దాం పద' అన్నాడు! నాకు లోపల సందేహంగా వున్నప్పటికీ పైకిమాత్రం సంతోషాన్ని కనబరుస్తూ—'సరే పద' మని బయలుదేరాను.

వాస్తవానికి వాస్తవమే చెప్పాలి; పండిట్ రావంటే అంతకుక్రితం నా మనస్సులోవున్న అవిశ్వాసమంతా ఒక్క—సారిగా గుప్పున ఎగిరిపోయింది. ఎందుకంటె; స్టోర్సు మేనేజరు మనవాణ్ని చూసి-'హలో! మిష్టర్ పి.బి.జి. రావ్! (బహుశా ఇక్కడ చలామణిలోవున్న పేరయివుంటుంది!) కమాన్! టేక్ యువర్ సీట్-' అన్నాడు! మేనేజరు చూపించిన కుర్చీలో తను కూర్చుంటూ, నన్ను కూచోమని చెప్పాడు-పండిట్ రావు. నా కాశ్చర్యం వేసింది. నా సెక్యూరిటీపత్రంమీద బాల గంగాధరరావు, ఉరఫ్ పి. బి. జి. రావు. ఉరఫ్ పండిట్ రావు సంతకంచేశాడు. నాకు నిజం చెప్పొద్దూ—పండిట్ రావుమీద ఎక్కడలేని గౌరవభావం ఏర్పడిపోయింది.

ఉభయులం బయటికి వచ్చాం! నే నుండబట్టుకోలేక

అన్నాను—'పండిట్‌రావ్! నీ ఋణం ఎలా తీర్చుకోను! నన్ను బాగా ఎరిగినవాళ్లు దగాచేశారు. నామీద వాళ్ళకు నమ్మకంలేకపోయింది. నీవు నాకు చాలా సహాయపడ్డావు. చాలా చాలా ధన్యవాదాలు!' 'ఇంత చిన్నపనికి నీ వింత యిదవుతావేంటోయ్, పోనిద్దూ!'అని చప్పరించాడు,పండిట్ రావు.

అప్పటిదాకా ఎక్కడో వుంటున్న పండిట్ రావు—ఆ రోజునుంచి నాతోపాటే హోటల్లోవుండటం ప్రారంభించాడు. పదిహేనురోజు లయ్యాక ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నా; పండిట్‌రావుకూడా నాతోనే వచ్చాడు. హోటల్లోవున్న పదిహేనురోజులకుఅయిన యావత్తు ఖర్చు నేనే పెట్టుకున్నాను. ఆ తరువాత నెలా పదిహేనురోజులుకూడా ......'మధుసూదనరావూ! మా బిజినెస్ కొంచెం 'డల్'గా వుంది. ఎక్స్‌పోర్ట్సు లేవు; ఆదాయంలేదు; ఇంకో నెల నీతోపాటేవుంటాను!' అని అనటంమూలాన నేనే అన్నిఖర్చులూ భరించాను. పైగా నా ధోవతులు ఉపయోగించుకునేవాడు; నా బెడ్ వేసుకొని పడుకునేవాడు. స్నానానికి నా టవల్సు, నా సోపూ వాడుకునేవాడు. నా రేజర్‌తో షేవ్ చేసుకునేవాడు! మరల నేను బయటికివెళ్ళే సమయానికి చాలా నీటుగా తయారయి తనూ బయలుదేరుతూ 'ఇదో పదో డబ్బుంటే ఇలా ఇవ్వు!' అని నేను సమాధానం చెప్పకమునుపే నా జేబులో చెయ్యిబెట్టి ఎంతవస్తే అంత తీసుకునేవాడు—నవ్వుతూ! పైపెచ్చు అప్పుడప్పుడు స్టోర్సులోకివచ్చి— ఆ వస్తువా, ఈ వస్తువా తీసుకొని ముప్పయి రూపాయలు బిల్లు చేసి అదీ నన్నే యివ్వమనేవాడు.

ఇలా యింకో నెలకూడా గడిచిపోయింది. నేను ఇంటి దగ్గర్నుంచి తెచ్చుకున్న నూటపాతిక రూపాయలూ అయిపోయాయి. ప్రతినెలావచ్చే జీతంలోనూ కానీ మిగలకుండా వుంది. నేను కొంచెం మొహం చిట్లించుకున్నట్లు కన్పిస్తే చాలు, ఏదో మాటలధోరణిలోబెట్టి నన్ను ఉబ్బేసేవాడు; ఏదేదో చెప్పి నన్ను మరిపించేవాడు; అప్పుడు నా కేవిషయం గుర్తుండేదికాదు.

♦ ♦ ♦ ♦

పండిట్‌రావు భారం మోయలేక చివరకు ఈవాళ ఖచ్చితంగా చెప్పేశాను— 'పండిట్ రావూ! నేను సంసారం పెట్టుకోబోతున్నా; నా భార్యను సోమవారంనాటికల్లా ఇక్కడికి రమ్మని ఉత్తరం రాయాలనుకొంటున్నా. కనుక నీ దారి నువ్వుచూచుకోటం ఉత్తమం!' అని. ఎంత నిర్వికారంగా సమాధానం చెప్పాడో మీరు విన్నారుగా! ఏదో బిజినెస్ అన్నాడు; ఏమీలేదు; అంతా మోసం! ఇతగాడి భోజనాదుల సకల సౌకర్యాలు మరోచోట ఏర్పడేదాకా నన్నువదిలి వెళ్ళడట! ఇంత విడ్డూరం ఎక్కడయినా వున్నదా? నా సెక్యూరిటీపత్రంమీద సంతకంచేసి నా కేదో సహాయపడ్డానని చెబుతాడు— మాటిమాటికి! దానికి ప్రత్యామ్నాయంగా నా గొంతుమీద కూచోవాలని వుందా?

కాని తప్పదు; పండిట్‌రావుకు మరల నాలాంటి వ్యక్తి జతపడేంతవరకు ఈ భారం నేను మోయక తప్పదు.